నాన్‌స్టాప్ కామెడీ

నగరవాసులను నవ్విస్తున్న కళాకారులు

ప్రతీ ఆదివారం సందడిగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయం

నేటి ఉరుకుల పరుగుల జీవనంలో నవ్వడం మర్చిపోయారనడం అతిశయోక్తి కాదు. జనాన్ని నవ్వించడం కోసం హ్యూమర్ క్లబ్‌లు, లాఫింగ్ క్లబ్‌లు తమవంతు స్వచ్ఛందంగా కృషి చేస్తున్నాయి. నవ్వు ఒక టానిక్... నవ్వు ఒక పాజిటివ్ ఆటిట్యూడ్... నవ్వుతో ఆరోగ్యం... చిరునవ్వుతో ఏదైనా సాధించవచ్చని పెద్దలు చెబుతుంటారు. అందుకే ప్రతి ఒక్కరూ నవ్వండి.., నవ్వించండి.., నవ్వుతూనే ఉండండి అంటున్నారు కామెడీ క్లబ్ ప్రతినిధులు. యాంత్రిక జీవనంలో ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించేలా నగరంలోని కామెడీ క్లబ్‌లు విశేషంగా కృషి చేస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ కొంతమంది కలిసి క్లబ్‌గా ఏర్పడి కామెడీని ప్రవృత్తిగా చేసుకున్నారు. నెలలో నాలుగు ఆదివారాలు నాలుగు కామెడీ క్లబ్‌లు నవ్వులు పండిస్తున్నాయి.
– సీతంపేట


ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ కళాకారులు ప్రదర్శిస్తున్న స్కిట్ (ఫైల్)

విశాఖ హ్యూమర్ క్లబ్.. హాస్యవల్లరి

రావి గోపీకృష్ణ బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగిగా పనిచేస్తూ 2000 సంవత్సరంలో విశాఖ హ్యూమర్ క్లబ్ స్థాపించారు. ప్రతీ నెల రెండో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయలో క్రమం తప్పకుండా మూడు గంటల పాటు 'హాస్యవల్లరి' నిర్వహిస్తూ నగటు జీవిని నవ్వుల్లో ముంచెత్తుతున్నారు. దాదాపు ఇప్పటి వరకు 1500లకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. క్లబ్ కళాకారులు కామెడీ స్కిట్స్, జోకులు చెప్పి ఆహూతులను నవ్విస్తున్నారు. అంతేకాకుండా ప్రేక్షకులను కూడా భాగస్వామ్యం చేస్తూ ఔత్సాహికులచే జోకులు చెప్పించి ప్రోత్సహిస్తున్నారు. తన సహోద్యోగులనే క్లబ్ సభ్యులుగా గోపీకృష్ణ ఎంచుకున్నారు. సహోద్యోగి కార్యదర్శి ఎస్.ఎస్.రామానుజం, సభ్యులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి (విశ్రాంత తహసీల్దార్), ఈ.భానుప్రకాష్ (మెడికల్ రిప్రజెంటేటివ్), టీవీ కళాకారిణి ఎం.శివజ్యోతి, కె.నాగగణేష్, సూర్యం క్లబ్‌లో కీలక సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. వీరంతా తీరిక సమయాల్లో స్కిట్స్ ప్రాక్టీసు చేసి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నారు.



విశాఖ హ్యూమర్ క్లబ్ కళాకారులు ప్రదర్శిస్తున్న స్కిట్

నగరవాసులకు నవ్వుల సందడి

ఆదివారం సాయంత్రం 6 గంటలు అయ్యిందంటే ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పెద్ద హాలు ప్రేక్షకులతో నిండిపోతుంది. ప్రతీ ఆదివారం ప్రేక్షకుల సందడితో కిటకిటలాడుతుంది. నవ్వులతో హాలు మార్మోగుతుంది. కామెడీ క్లబ్ కళాకారులు ప్రదర్శించే స్కిట్స్ చూడటానికి నగరంలోని సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. రెండు గంటలపాటు నాన్ స్టాప్ కామెడీ అందిస్తున్నారు. ఏళ్ల తరబడి ఆదివారం సాయంత్రం పూట కామెడీ క్లబ్స్ ఎందరినో నవ్వుల్లో ముంచెత్తి ప్రేక్షకుల ఆదరణ పొందాయి. నెలలో మొదటి ఆదివారం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, రెండో ఆదివారం విశాఖ హ్యూమర్ క్లబ్, మూడో ఆదివారం క్రియేటివ్ కామెడీ క్లబ్, నాలుగో ఆదివారం హాస్యప్రియ కామెడీ క్లబ్ కళాకారులు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నారు. ఇటీవల కొంత కాలంగా మూడో ఆదివారం క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రదర్శనలకు దూరంగా ఉంది.

హాస్యప్రియ కామెడీ క్లబ్..



విశాఖ ప్రజలకు ఉచితంగా వినోదం అందించాలన్న కోరికతో నావల్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తున్న ఇమంది ఈశ్వరరావు 2012 నవంబర్‌లో హాస్యప్రియ కామెడీ క్లబ్ స్థాపించారు. ప్రస్తుతం క్లబ్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇప్పటికి రెండు వేలకుపైగా కామెడీ షోలు క్లబ్ ద్వారా ప్రదర్శించారు. ఏయూలో థియేటర్ ఆర్ట్స్‌లో యాక్టింగ్, డైరెక్టర్ కోర్సు పూర్తి చేసిన ఈశ్వరరావు నగర శివార్లలో ఎక్కువగా కామెడీ షోలు నిర్వహించారు. గత ఏడాది కాలంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రతీ నెలలో నాలుగో ఆదివారం కామెడీ స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను నవ్విస్తున్నారు.

ఫ్రెండ్స్ కామెడీ క్లబ్.. వినోదవల్లరి

వృత్తి పరంగా ఆంధ్రాబ్యాంకులో సీనియర్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తూ అందరినీ నవ్వించడం ప్రవృత్తిగా మలుచుకున్న ముత్యా వెంకట సుబ్రహ్మణ్యం హాస్య ప్రియులందరికీ సుపరిచితులు. తాను నవ్వుతూ.. అందర్నీ నవ్వించడానికి గత 22 ఏళ్లుగా అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. చిన్నతనం నుంచి నాటకాలు, హాస్యంపై మక్కువతో 'మంచం మీద మనిషి' నాటకంతో రంగస్థల జీవితం ప్రారంభించారు. మూడు పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలు పూర్తి చేసి, ఆంధ్రా బ్యాంకులో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న కాలంలో 2012లో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ స్థాపించారు. వినోదవల్లరి పేరుతో ప్రతి నెల మొదటి ఆదివారం విశాఖ పౌరగ్రంథాలయంలో రెండు గంటల సేపు కామెడీ స్కిట్స్ ప్రదర్శిస్తున్నారు. గత ఐదేళ్లుగా హైదరాబాద్, గోదావరి ఖనిలో కూడా ప్రదర్శనలిస్తున్నారు. దాదాపు రెండు వేలకు పైగా ప్రదర్శనలు పూర్తి చేశారు. ప్రస్తుతం బ్యాంకు సీనియర్ మేనేజర్‌గా పదవీ విరమణ చేసి హైదరాబాదులో స్థిరపడ్డారు. అయినప్పటికీ హాస్యంపై మక్కువతో ప్రతీ నెల మొదటి ఆదివారం విశాఖ వచ్చి క్లబ్ ద్వారా కామెడీ స్కిట్స్ ప్రదర్శించి హాస్యం పండిస్తున్నారు. అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎస్.వి.రాజేశ్వరి, బజర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, పోర్టు శేషు, పుష్యమి, నాయుడు, వెంకటేశ్వరరావుతో కలిసి కామెడీ స్కిట్స్ ప్రదర్శిస్తున్నారు.

దేవుడిచ్చిన వరం



బ్యాంకులో ఉద్యోగం చేస్తూ 2012 నుంచి నెలలో మొదటి ఆదివారం పౌరగ్రంథాలయంలో కామెడీ స్కిట్స్ ప్రదర్శిస్తున్నాం. కొన్నేళ్లుగా హైదరాబాద్ సిటీలో రెండో ఆదివారం, గోదావరి ఖనిలో ఆఖరి శనివారం కామెడీ స్కిట్స్ ప్రదర్శిస్తున్నాం. బ్యాంకులో రిటైర్ అయ్యాను. హైదరాబాదులో ఉంటూ విశాఖ వచ్చి ప్రతీ నెలా మొదటి ఆదివారం వినోద వల్లరి పేరిట హాస్యం అందిస్తున్నాం. ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. వందలాది మంది ప్రేక్షకులను నవ్వించడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను.

– ఎం.వి.సుబ్రహ్మణ్యం, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకులు

క్లుప్తంగా

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలి


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం : ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశించారు. జీవీఎంసీ జోన్ – 5 జ్ఞానాపురం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 3 వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవో ఎస్.పుణ్యవతి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి పాల్గొన్నారు.

ఎన్‌ఎంసీహెచ్‌కి కుర్చీలు అందజేత


జోస్ అలుక్కాస్ ప్రతినిధులను సత్కరిస్తున్న ఎన్‌ఎంసీహెచ్ ఉపాధ్యాయులు

సీతమ్మధార : స్థానిక పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్లస్ టూకి జోస్ అలుక్కాస్ జ్యూయలర్స్ యాజమాన్యం చేయూతనిచ్చింది. ఈ మేరకు పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్లస్ టూ యాజమాన్యానికి 20 కుర్చీలు, 15 అల్మరాలు అందజేశారు. అనంతరం ఆ సంస్థ ప్రతినిధులు పీఆర్‌వో మాధవన్, అకౌంటెంట్ శ్రీజిత్‌లను పాఠశాల సిబ్బంది పూలమాలలతో ఘనంగా సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.రాంప్రసాద్, ఉపాధ్యాయులు బెండి ప్రసాద్, ప్రియదర్శిని, వరలక్ష్మి, హేనా, కరుణాకర్, పుష్పలత, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నీరజా రెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా బాక్సింగ్ పోటీలు


విజేతలతో అతిథులు, నిర్వాహకులు

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం మధుసూధన్‌నగర్‌లో విశాఖ ప్రొఫెషనల్ బాక్సింగ్ కౌన్సిల్ లీగ్ – 2 పోటీలు సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీలను విశాఖ ప్రో బాక్సింగ్ కౌన్సిల్ అధ్యక్షుడు రఘురాం, నేషనల్ పోర్టు యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు. పోటీల్లో 11 ఫైట్లు, 3 బెల్ట్ టైటిళ్ల కోసం రాష్ట్ర నలుమూలల నుంచి బాక్సర్లు పోటీపడ్డారని నిర్వాహకులు తెలిపారు. ఐబీసీ జడ్జి రూబెన్ విజేతలను ప్రకటించారు. ఐబీసీ సూపర్‌వైజర్ అజయ్ సాల్వి పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి.అమ్మోరు, సహాయ కార్యదర్శి గిరి, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ సునీల్, ఆర్.ప్రవీణ్ సింగ్, డాక్టర్ జ్యోత్స్న తేజ, చందు, సతీష్, గోపాల్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల కొట్లాటపై కేసు

సీతమ్మధార : ఇరువర్గాల కొట్లాటపై కేసు నమోదు చేశామని ద్వారకా పట్టణ పోలీసులు తెలిపారు. సీతంపేట రెల్లివీధిలో నివసిస్తున్న రాము ఇంటి ఎదుట స్నేహితులతో కలిసి తరుణ్ ఆదివారం రాత్రి బహిరంగంగా మద్యపానం చేశారు. దీంతో రాము వచ్చి మద్యపానం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించడంతో తరుణ్ దౌర్జన్యం చేశాడు. దీంతో ఇరు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈ కొట్లాటలో రాము చెవి మీద, తరుణ్ తల మీద గాయాలయ్యాయి. దీంతో ఇద్దరూ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి ద్వారకా ఎస్‌ఐ జె.ధర్మేంద్ర దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్‌బెల్టుకు రూ.39 లక్షలతో ఫెన్సింగ్

సీతమ్మధార : జీవీఎంసీ చేపట్టిన గ్రీన్‌బెల్టు ఫెన్సింగ్ పనులకు 14వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్‌రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. జాతీయ రహదారి మీద 580 మీటర్ల మేరకు గ్రీన్ బెల్టుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారని వివరించారు. సుమారు రూ.39.79 లక్షల వ్యయంతో సత్యసాయి కృపా మందిర్ జంక్షన్ నుంచి గురుద్వారా కూడలి వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. గ్రీన్‌బెల్టు స్థలాల కబ్జాకు అడ్డుకట్ట వేసేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జోన్ – 3 కమిషనర్ కె.శివప్రసాద్, డీఈ విజయకుమార్, ఏఈ శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక, అరకు నియోజకవర్గ పార్లమెంటరీ సమన్వయకర్త పరశురామరాజు, నాయకులు గొంప ధర్మారావు, హరిత, జానకి రామరాజు, రాకేష్, శంకరరావు, రాంబాబు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి మూడు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించిన ఫిర్యాదుల సమాచారాన్ని ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గోపన్న, యూసీడీ విభాగం ఏపీడీ ఎల్.రాము, ఆర్వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న జీవీఎంసీ జోన్-3 కమిషనర్ శివప్రసాద్

సీతమ్మధార: స్థానిక సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులు వినతులు అందజేశారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ 11 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్‌ఐ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు బ్రేక్

మళ్లీ 18 నుంచి నిర్వహణ

సీతమ్మధార: ప్రజల సమస్యలు, భూ వివాదాల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు బ్రేక్ పడింది. ఈ నెల 6 నుంచి రాష్ట్రంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభించడం తెలిసిందే. ఇందులో భాగంగానే విశాఖ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలో ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు ఆగిపోవడం గమనార్హం. సీతమ్మధార మండల పరిధిలో వాస్తవానికి డిసెంబర్ 20 వరకు నిర్ణీత వేదికల్లో సదస్సులు జరగాల్సి ఉంది. ఈ నెల 6న రేసపువానిపాలెం రెవెన్యూ విలేజీ ప్రాంత ప్రజలకు సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ నెల 9న మద్దిలపాలెం ప్రాంత ప్రజలకు 109 నంబర్ సచివాలయం, 11న పెదవాల్తేరు ప్రాంత ప్రజలకు 99 నంబర్ సచివాలయం, 13న చినవాల్తేరు ప్రజలకు ఎంవీపీ కాలనీ లుంబినీ పార్కు ఏరియాలోని కల్యాణ మండపం, 16న వెంకోజీపాలెం ప్రాంత ప్రజలకు ఎంవీపీ కాలనీ నేతాజీ పార్కులోని 105 నంబర్ సచివాలయంలో, 18న దొండపర్తి ప్రాంత ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానాలో, 20న అల్లిపురం ఎక్స్‌టెన్సన్ వార్డు ప్రాంత ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానాలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ ప్రకటించడం తెలిసిందే. సోమవారం నాటి సదస్సు జరగలేదు. కాగా.. ఈ సదస్సులు ఈ నెల 18, 20 తేదీల్లో దొండపర్తి, అల్లిపురం రెవెన్యూ గ్రామాలకు ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం షాదీఖానాలో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని తహసీల్దార్ రమేష్ సోమవారం 'సాక్షి'కి తెలిపారు.

ముస్లిం వివాహ పరిచయ వేదికకు స్పందన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్‌ఎన్ కాలనీలో గల ఓ హోటల్‌లో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లింల ఉచిత వివాహ పరిచయ వేదిక సోమవారం నిర్వహించారు. ఈ వేదికలో పాల్గొనేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి పలువురు ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి పిల్లలకు తగిన సంబంధాలు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 7 సార్లు ఉచిత వివాహ పరిచయ వేదికలు ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఎనిమిదో వేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 250 మంది వివాహాలు చేసుకున్నారని తెలిపారు. ఇది పూర్తిగా ఉచిత సేవ అని తెలిపారు. పేద ముస్లింలకు తమ సొసైటీ తరఫున షాదీ ఖర్చులు భరించి, ఉచితంగా వివాహాలు కూడా జరిపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునీర్‌ఖాన్ (బాబా), షేక్ అబ్దుల్ మునీర్, అబ్బాస్ హుస్సేన్, సయ్యద్ అమీర్ జాన్, హమబూబ్ ఆలీఖాన్, షేక్ అహ్మద్ వల్లి, మహ్మద్ హబీబ్, హాజీ రహ్మతుల్లా, మెహబూబ్ షరీఫ్, మహ్మద్ లుక్మాన్, అస్గర్ ఆలీ, మహ్మద్ అస్లం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు హైదర్ ఆలీ

కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోండి

సీతమ్మధార: తమ కార్యాలయం పరిధిలోని తూర్పు, ఉత్తర నియోజవర్గాలకు చెందిన యువతీ, యువకులంతా విధిగా కొత్త ఓటర్లుగా నమోదు కావాలని అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ కోరారు. సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. ఈ రెండు నియోజకవర్గాల్లో 18, 19 ఏళ్ల వయసు నిండిన యువతీ, యువకులంతా సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తులు నింపి, అవసరమైన జిరాక్స్ కాపీలు జతచేసి ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో ఫొటో, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు జత చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 24లోగా కొత్త ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

మందుబాబులకు జైలు శిక్ష

మద్దిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి న్యాయస్థానం జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ పోలీసులు సోమవారం పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురు మద్యం తాగి పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారని తెలిపారు. వారిలో ఐదుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించగా, శాంతినగర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ గౌరీ శంకర్ (29)కు పది రోజులు, ఎన్ఏడీ కొత్త రోడ్డు ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ డి.నాగరాజుకి 12 రోజులు జైలు శిక్ష న్యాయమూర్తి విధించినట్టు తెలిపారు.

14వ వార్డులో చెత్త తరలింపు


లారీలోకి చెత్త వేస్తున్న పొక్లెయినర్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లో జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ సిబ్బంది సోమవారం చెత్తకుప్పలు తొలగించారు. ఇక్కడి నరసింహనగర్‌కి వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్తను జేసీబీ సాయంతో లారీల ద్వారా తరలించారు. అలాగే జంగిల్ క్లియరెన్స్ కూడా నిర్వహించామని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్రాంతి తెలిపారు. స్థానిక శ్రీ గణేష్ సేవా సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి ఫిర్యా దు మేరకు చెత్త తొలగించామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చెత్త తొలగించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి మూర్తి ధన్యవాదాలు తెలిపారు.

సన్మార్గంలో ఆలోచించాలి

సీతమ్మధార: సమాజంలో అత్యధికులు వినియోగించే నానుడి యద్భావం తద్భవతి అనేది తప్పు అని, ఏది ఎలా ఉండాలో అలాగే ఉంటుందని, మన భావనకు అనుగుణంగా మారదని చిన్న జీయర్ స్వామి అన్నారు. సీతమ్మధారలో నిర్వహిస్తున్న గీతా జయంతి వేడుకల్లో మూడో రోజు సోమవారం ఉదయం ఆరాధన అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వస్తువు, జంతువుకు దాని స్వాభావిక ధర్మం ఉంటుందన్నారు. దాన్ని మనకు అనుకూలంగా భావించడం వల్ల వాటి వాస్తవ స్వభావం మారదన్నారు. మన ఆలోచనలను సన్మార్గంలో పెట్టుకుంటే ప్రతికూల పరిస్థితుల్లో సైతం నెగ్గుకు రాగలమన్నారు. ప్రతి జీవిలోనూ దేవుడు ఉన్నప్పుడు, దాన్ని దేవాలయంగా భావించాలన్నారు.


అనుగ్రహ భాషణం చేస్తున్న చిన్నజీయర్‌స్వామి

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు కనకమ్మ వారి వీధిలోని రెవెన్యూ స్థలంలో ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది సోమవారం బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో గతంలో ఏర్పాటు చేసిన బోర్డును కొంత మంది మాయం చేసేసి, నిర్మాణాలు చేపడుతుండడంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై 'ఆక్రమణ చెరలో ప్రభుత్వ స్థలాలు' శీర్షికతో ఈ నెల 7న సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌ఐ ప్రేమలత, వీఆర్వో సుందరమ్మ, ప్లానింగ్ సెక్రటరీ హేమ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ స్థలమని పేర్కొంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సాక్షిలో ప్రచురించిన కథనంపై జోన్ – 3 ఏసీపీ మధుబాబు స్పందిస్తూ సదరు స్థలం యూఎల్‌సీగా గుర్తించామని, ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రేకుల షెడ్‌ను పోలీసుల సహకారంతో తొలగిస్తామని సోమవారం తెలిపారు.


సీతంపేట కనకమ్మ వీధిలోని ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్‌ఐ ప్రేమలత

అన్ని మతాలనూ గౌరవించాలి

సీతంపేట: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'మత స్వేచ్ఛ, మన స్వేచ్ఛ' అనే అంశంపై మంగళవారం మధురవాడలో సదస్సు నిర్వహిస్తున్నట్టు సీఆర్‌ఐఐ జాతీయ అధ్యక్షుడు, విశ్రాంత ఐపీఎస్ ఆఫీసర్ కూచిపూడి బాబూరావు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం, దైవారాధన వ్యక్తిగతమని, వాటిని రాజకీయాలతో ముడిపెట్టడం వల్ల దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. విభిన్న మతాలు, సంస్కృతులు గల భారతదేశంలో అన్ని మతాలను గౌరవించడం నిజమైన సెక్యులరిజమన్నారు. భారతదేశంలో రాజ్యాంగం సంక్షోభంలో పడిందన్న విషయం తెలియజేయడానికి ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొన్ని సంవత్సరాలుగా రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఒకప్పుడు ముస్లింలపై దాడులు జరిగేవని, కొన్నేళ్లుగా క్రైస్తవులపై దాడులు, అరాచకాలు పెరిగాయన్నారు. మత మార్పిడి చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. హిందూ మతంలో ఉంటేనే షెడ్యూల్ కులాలుగా పరిగణిస్తామనడం అన్యాయమన్నారు. సమావేశంలో పులిగుజ్జి సురేష్, ప్రేమ్ తరంగ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విశ్రాంత ఐపీఎస్ ఆఫీసర్ కూచిపూడి బాబూరావు

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం

మురళీనగర్: వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయంగా నిలుస్తున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ కుబేర్ డోనార్ కమల్ బైద్ అన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పార్కు బ్యూటిఫికేషన్‌తోపాటు వాకర్స్‌కు అవసరమైన అన్ని సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో భాగంగా కార్పొరేట్ ఆస్పత్రుల సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సహకారంతో తమ కార్యవర్గం నిర్వహించిన సేవా కార్యక్రమాలకు వాకర్స్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్, క్లబ్ నూతన నిబంధనావళిని ఆవిష్కరించారు. ఈ నెలాఖరున పదవీ కాలం ముగియనున్న చంద్రమౌళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, కార్యదర్శి పి.చెల్వరాజు, వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ పాల్గొన్నారు.


వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళిని సత్కరిస్తున్న కమల్ బైద్, ప్రతినిధులు